సాక్షి
నిజామాబాద్
శనివారం । 25 । జనవరి । 2025



రూ.వెయ్యి కోసం హత్యలు
వెయ్యి రూపాయల కోసం రెండు హత్యలు చేసిన ఘటన నిజామాబాద్ నగరంలో చోటు చేసుకుంది.
- 10లో ▸



మంజూరు సరే..
బాల్కొండ నియోజకవర్గానికి మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను నెలలు గడుస్తున్నా పంపిణీ చేయడం లేదు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.3 /14.4

వాతావరణం
ఉదయం మంచు కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

బాలికలు కరాటే నేర్చుకోవాలి



ఖలీల్‌వాడి: బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటేతోపాటు వివిధ అంశాల్లో శిక్షణ తీసుకోవాలని జిల్లా జడ్జి సునీతా కుంచాల అన్నారు. శుక్రవారం బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులతో కలిసి జిల్లా కోర్టు నుంచి ధర్నా చౌక్ వరకు నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికల ఆరోగ్యంపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. బాలికలు నెలసరి సమస్యలపై చర్చించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి మాట్లాడుతూ.. బాలికలను ఎవరైనా వేధిస్తే డయల్ 100, 1098కు ఫోన్ చేయాలన్నారు. డీఈవో అశోక్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



బాల్కొండ: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. శుక్రవారం మెండోరా మండలం పోచంపాడ్‌లోని బాలికల గురుకుల పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. వంట గదిలో కూరగాయలను పరిశీలించారు. ఎంపీడీవో వనజ, ప్రిన్సిపాల్ గోదావరి, వైద్యాధికారి రాకేష్ ఉన్నారు.

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి



రుద్రూర్: ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. పోతంగల్ మండలం కల్లూర్ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. గణితం, ఆంగ్లం సబ్జెక్టులపై మరింత శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈవో శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు రైతు అధ్యయన కమిటీ రాక

మోర్తాడ్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న రైతుల ఆత్మహత్యలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యాయనం చేయడానికి బీఆర్ఎస్ పార్టీ రైతు అధ్యయన కమిటీ శనివారం జిల్లాకు రానుందని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. కమిటీ ఆదిలాబాద్ జిల్లా నుంచి నిజామాబాద్ జిల్లాకు చేరుకోనుందని వెల్లడించారు. అధ్యాయన కమిటీ చైర్మన్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, కమిటీ సభ్యులు మెండోరా మండలం బుస్సాపూర్, జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో నిర్వహించే రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

నగర అభివృద్ధికి సహకరించడం లేదు



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకరించడం లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఆరోపించారు. నగరంలోని పలు డివిజన్‌లలో ఆయన శుక్రవారం అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అర్బన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కావాలని సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లికి ఎన్నోసార్లు వినతిపత్రాలు ఇచ్చానన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిజామాబాద్ అభివృద్ధికి సహకరించకుండా పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు మంజూరు చేయడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ నీతూ కిరణ్, కార్పొరేటర్లు పంచరెడ్డి ప్రవళిక, మాయావర్ సవిత, లత, బురుగుల ఇందిర, వినోద్ పాల్గొన్నారు.

ఇష్టారీతిన మైనింగ్!



అడవి మామిడిపల్లి వద్ద కొనసాగుతున్న ఆర్‌వోబీ పనులు

అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ పనుల పేరిట అనుమతులు లేకుండా ఇష్టారీతిన మొరం, కంకర తరలిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమంగా మైనింగ్ చేపడుతున్నారు. కంకర, మొరం క్వారీలు నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయినా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మరోవైపు టెండర్లు దక్కించుకున్న పనులు మాత్రం నత్తనడకన చేపడుతున్నారు. అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్ అధికారులు ఇటీవల జిల్లాలో విచారణ చేపట్టారు.

- ప్రజాపనుల పేరిట అనుమతులు లేకుండానే క్వారీలు, క్రషర్ల నిర్వహణ
- విద్యుత్ కనెక్షన్ లేకుండానే జనరేటర్ల ద్వారా క్రషర్లు నడిపిన వైనం
- మరోవైపు నత్తనడకన పనులు
- ఇటీవల ఉమ్మడి జిల్లాలో సర్వే చేసిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: టెండర్ల ద్వారా ప్రజా పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఆయా పనుల పేరిట అక్రమ క్వారీలు నిర్వహిస్తూ అనుమతులు లేకుండానే మొరం, కంకర ఇష్టం వచ్చినట్లు తవ్వేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదాయానికి రూ.వందల కోట్లలో గండి కొడుతున్నారు. పైగా టెండర్ అగ్రిమెంట్ ప్రకారం చేయాల్సిన పనులను మాత్రం ఏళ్లతరబడి సాగదీస్తున్నారు. అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై సమాచారహక్కు చట్టం ద్వారా తీసుకున్న వివరాలు చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్లే జాతీయ రహదారి మీద మాక్లూర్ మండలం అడవిమామిడిపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు 2015 నుంచి కొనసాగుతున్నాయి. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ఈ రహదారి మీద ఓవర్ బ్రిడ్జి కట్టేందుకు రైల్వే శాఖ రూ.17 కోట్లు కేటాయించింది. ఇందులో భూసేకరణకే రూ.7 కోట్లు కాగా, మిగిలిన రూ.10 కోట్లు నిర్మాణ పనులకు కేటాయించారు. అగ్రిమెంట్ ప్రకారం రెండేళ్లలోనే ఇరువైపులా అప్రోచ్ వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. అయినప్పటికీ పనులు ముందుకు కదలడంలేదు. ఇదిలా ఉండగా రైల్వేలైన్‌పై వంతెనను మాత్రం రైల్వేశాఖ యుద్ధప్రాతిపదికన నిర్మాణం పూర్తి చేసి ఇచ్చింది. అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

15 ఎకరాల్లో క్వారీ..

బోధన్ డివిజన్, కామారెడ్డి జిల్లా బాన్సువాడ ప్రాంతాల్లో వివిధ రోడ్ల పనులు చేస్తున్న ఓ కాంట్రాక్టర్ కామారెడ్డి జిల్లా బీర్కూర్ వద్ద సుమారు 15 ఎకరాల్లో అక్రమ క్వారీ నిర్వహించాడు. ఎలాంటి అనుమతులు లేకుండా క్రషర్ సైతం నిర్వహించాడు. అక్రమ క్రషర్ కావడంతో విద్యుత్ కనెక్షన్





పనులు నత్తనడకన సాగుతుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు

తీసుకోకుండా పూర్తిగా జనరేటర్ మీద నడిపారు. సుమారు రూ.40 కోట్ల విలువజేసే మెటల్ తవ్వినట్లు సమాచార హక్కు చట్టం ద్వారా తెలిసింది. ఈ నేపథ్యంలో ఇటీవల హైదరాబాద్ నుంచి విజిలెన్స్ అధికారులు వచ్చి ఈటీఎస్ (ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్) సర్వే చేశారు. ఇదే కాంట్రాక్టర్ నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ఉమ్మెడ–నిర్మల్ జిల్లా పంచగుడి మధ్య గోదావరిపై కట్టిన వంతెన పనుల నిమిత్తం పంచగుడిలో అక్రమ క్వారీ, అనుమతులు లేని క్రషర్ నిర్వహించి విద్యుత్ కనెక్షన్ లేకుండా పూర్తి జనరేటర్‌తో నడిపారు. ఇక్కడ సుమారు రూ.150 కోట్ల విలువజేసే మెటల్ తోడేసినట్లు ఆర్‌టీఐ ద్వారా తెలిసింది. దీనికి సంబంధించి ఇటీవల కరీంనగర్ నుంచి వచ్చిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సర్వే చేసుకుని వెళ్లింది. ఈ విషయంపై వివరణ కోరేందుకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మైనింగ్ అధికారులకు 'సాక్షి' ఫోన్ చేయగా స్పందించలేదు.

అక్రమంగా మొరం తరలింపు

అడవి మామిడిపల్లి ఆర్‌వోబీకి సంబంధించి తరలిస్తున్న మొరం పూర్తిగా అనుమతులు లేని ప్రాంతాల నుంచి అక్రమ మార్గంలో తరలిస్తున్నారు. ఈ విషయమై రెండేళ్ల కిందట గనుల శాఖ అధికారులకు ఫిర్యాదులు సైతం వెళ్లాయి. ఆ సమయంలో అక్కడకు వెళ్లిన మైనింగ్ అధికారులు మొరంతో నింపిన సిమెంట్ బ్లాక్స్(బిళ్లలు)ను పంచునామా చేశారు. అయినప్పటికీ తరువాత దాన్ని పట్టించుకోలేదు. దీంతో మొరం తరలింపు అదేవిధంగా చేస్తున్నారు. ఇటీవల విజిలెన్స్ అండ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ కార్యాలయం నుంచి బృందం వచ్చి సర్వే చేసింది. అనుమతి లేని క్వారీల నుంచి సుమారు 80వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తెచ్చినట్లు గుర్తించినట్లు సమాచారం.

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న ఈరవత్రి అనిల్

మోర్తాడ్: రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తుందని రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. గత ప్రభుత్వం లెక్కలేని ఖర్చులతో, అక్రమాలతో రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని ఆరోపించారు. శుక్రవారం మోర్తాడ్‌లో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం ప్రజల క్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయ కూలీలకు ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర సహకార సంఘాల అసోసియేషన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో రెండుమార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కొత్త రేషన్ కార్డుల జారీకి చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ రొక్కం మురళి, బూత్‌పురం మహిపాల్, ముత్యాల రాములు, జక్కం అశోక్, బద్దం రాజశేఖర్, పుప్పాల అశోక్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన రూరల్ ఎమ్మెల్యే



మోపాల్: విదేశీ పర్యటనను ముగించుకుని తిరిగి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంపై అభినందనలు తెలియజేసి, శాలువాతో సన్మానించారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు

- గుంతలు పూడుస్తున్న అధికారులు
- రూ.1.20 కోట్లతో పనులు
- వేగంగా కొనసాగుతున్న మరమ్మతులు

నిజామాబాద్ నాగారం: అధ్వానంగా ఉన్న జిల్లాలోని ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు అధికారులు చర్యలు చేపట్టారు. గుంతలమయంగా ఉన్న రహదారులను బాగు చేయాలని గతేడాది జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లోని రోడ్లపై గుంతలను పూడ్చే పనులు సంబంధిత ఏఈలు, జేఈలు చేపట్టారు. పనులను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో రూ.కోటి 20లక్షలతో రహదారులపై ఉన్న గుంతలను పూడ్చేశారు. నందిపేట్, ఆర్మూర్, బాల్కొండ, బోధన్, డిచ్‌పల్లి, సిరికొండ, ధర్పల్లి మండలాకు వెళ్లే రహదారుల్లో ఉన్న గుంతలకు ప్యాచ్‌వర్క్‌లు పూర్తి చేశారు.

మరో రూ.కోటి అవసరం

జిల్లా కేంద్రం నుంచి ఆయా మండలాలకు వెళ్లే రహదారుల్లో ఉన్న గుంతలపై ప్యాచ్ వర్క్ పూర్తి చేశారు. అయితే మండలాల నుంచి పల్లెలకు వెళ్లే రహదారుల్లో గుంతలు అలాగే ఉన్నాయి. సరిపడ నిధులు లేకపోవడంతోనే గుంతలు పూడ్చలేదని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. గ్రామీణ రోడ్లకు కూడా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నిజామాబాద్ నుంచి ఆర్మూర్ మార్గంలో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

త్వరలో పూర్తి చేస్తాం

జిల్లాలో ఇప్పటికే రూ.కోటి 20లక్షలతో ప్యాచ్‌వర్క్‌లు పూర్తి చేశాం. మరో రూ.కోటి నిధులు అవసరం ఉంది. నిధులు రాగానే మిగిలిపోయిన గుంతలను కూడా పూడ్చడానికి చర్యలు తీసుకుంటాం. ప్రమాదకరంగా ఉన్న రహదారులు పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చాం.
– సురేష్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ

ముగిసిన ప్రజాపాలన సభలు

- నిలదీతలు, నిరసనల మధ్య కొనసాగిన వైనం
- నేటి నుంచి దరఖాస్తుల ఆన్‌లైన్

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతుభరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన గ్రామ/వార్డు సభలు శుక్రవారంతో ముగిశాయి. ఈనెల 21న ప్రారంభించిన సభలను రెండు విడతలుగా నిర్వహించగా ప్రతి గ్రామం, వార్డులో అధికారులు నిలదీతలు, నిరసనల మధ్య కొనసాగాయి. అర్హుల ఎంపికతో పోలిస్తే మళ్లీ స్వీకరించిన దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఉత్కంఠంగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఈ నెల 26న అర్హులను ఎంపిక చేసి ప్రొసిడింగ్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ ప్రస్తుత పరిస్థితి ప్రకారం కొద్ది మందికి మాత్రమే అర్హులుగా పత్రాలు ఇచ్చి దశలవారీగా ఎంపిక ప్రక్రియ కొనసాగించే అవకాశం ఉంది. స్వీకరించిన దరఖాస్తులను నేటి నుంచి ఆన్‌లైన్ చేయనున్నారు.

మొదట కొద్దిమందికే..?

లబ్ధిదారులకు ఈనెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా అర్హత పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ గ్రామ/వార్డు సభలు నిర్వహించిన తర్వాత అర్హుల ఎంపిక ప్రక్రియ క్లిష్టతరంగా మారడం, నిరసనలు, నిలదీతల నేపథ్యంలో ఎంపిక ప్రక్రియ హుటాహుటిన సాధ్యం కాలేకపోయింది. కచ్చితమైన అర్హులను కొద్ది మందిని మాత్రమే గుర్తించి గణతంత్ర దినోత్సవం రోజున వారికి అర్హత పత్రాలు అందించాలని భావిస్తున్నారు. దశలవారీగా సర్వే చేసి మిగతా వారిని ఎంపిక చేయాలని అధికారులు భావిస్తున్నారు.



గోవూర్‌లో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

జిల్లాలో గ్రామ పంచాయతీలు	530
వార్డులు	146

దరఖాస్తులు ఇలా..

పథకం	దరఖాస్తులు
రేషన్ కార్డులు	81,148
ఇందిరమ్మ ఇళ్లు	40,266
రైతుభరోసా	1,626
ఇందిరమ్మ ఆత్మీయభరోసా	19,305


నిర్వహించిన సభలు

తేదీ	గ్రామ/వార్డు సభలు
21	200
22	199
23	177
24	96

మ్యూల్ ఖాతాలతో సైబర్ దోపిడీ

- రాజస్థాన్ కేంద్రంగా నేరాలు
- జిల్లాలో ఇద్దరు ఏజెంట్ల అరెస్ట్
- 35 ఖాతాలను గుర్తించిన పోలీసులు

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): మ్యూల్ ఖాతాల ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యవహారంలో పోలీసులు జిల్లాకు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. శుక్రవారం నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ నగరంలోని ఆటోనగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ జవాద్, బోధన్‌లోని బురుడుగల్లికి చెందిన గుడుముల నితీశ్, మరికొంత మంది రాజస్థాన్‌కు చెందిన ప్రధాన నిందితులతో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. జవాద్, నితీశ్ కలిసి నిజామాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలతో 35 మ్యూల్ అకౌంట్లు తీయించారు. ఆయా బ్యాంక్ ఖాతాల వివరాలు, ఏటీఎం కార్డులు, సంతకాలు చేసిన చెక్ బుక్కులను నిందితులు రాజస్థాన్‌లోని ముఠాకు పంపారు. ప్రధాన నిందితులు సైబర్ నేరాల ద్వారా కొల్లగొట్టిన డబ్బులను ఆయా అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేసి తర్వాత విత్ డ్రా చేసుకునే వారు. మ్యూల్ ఖాతాదారులకు నెలకు రూ.15 వేల చొప్పున, ఏజెంట్లకు కమీషన్ చెల్లించేవారు.



గుట్టు రట్టయ్యిందిలా..

ఈనెల 8, 9 తేదీల్లో నిజామాబాద్ నగరానికి చెందిన బసకొండ నరేశ్ అకౌంట్ నుంచి విడుతలవారీగా రూ.1.05 లక్షలు డెబిట్ అయ్యాయి. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. ఆ డబ్బు అబ్దుల్ జవాద్ అకౌంట్‌లోకి వెళ్లినట్లు గుర్తించారు. సాంకేతిక ఆధారాలతో అబ్దుల్ జవాద్, గుడుముల నితీష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా సైబర్ ముఠా గుట్టు రట్టయ్యిందని ఏసీపీ తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఈ 35 మ్యూల్ ఖాతాలపై దేశవ్యాప్తంగా 40 సైబర్ క్రైం కేసులు నమోదయ్యాయన్నారు. సుమారు రూ.50 లక్షల వరకు సైబర్ దొంగలు లూటీ చేశారన్నారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి మ్యూల్ ఖాతాల వివరాలు, ఒక బ్యాంక్ పాస్‌బుక్, ఒక చెక్‌బుక్, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. సైబర్ నేరస్తులకు సహకరించేలా ఖాతాలను అద్దెకు ఇచ్చిన వారి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. దీనిలో బ్యాంకు అధికారుల పాత్రపై కూడా విచారణ చేపడుతామని ఏసీపీ తెలిపారు.

ఓటీఎస్ గడువు పెంపు

- రైతులకు కర్షక మిత్రరుణ సదుపాయం
- ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: రైతుల సౌకర్యార్థం వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) గడువును మార్చి 31 వరకు పొడగించినట్లు ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో 103వ అర్ధవార్షిక మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు సాధించిన ప్రగతిని వివరించారు. బ్యాంకు ఆర్థిక కార్యకలాపాలు రూ.2వేల కోట్లకు చేరుకున్నాయని, ఇందుకు సహకరించిన సహకార సంఘాలు, బ్యాంకు అధికారులు, డైరెక్టర్లకు చైర్మన్ కృతజ్ఞతలు తెలియజేశారు. రైతుల పంట రుణాలు పరిమితి రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షలకు పెంచినట్లు తెలిపారు. పంట రుణాలపై నాబార్డ్ 8 శాతం వడ్డీ ప్రతిపాదించగా రైతుల శ్రేయస్సు, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులతో సంప్రదించి 7 శాతాన్నే కొనసాగిస్తున్నామని తెలిపారు. బ్యాంకు నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) తగ్గింపు లక్ష్యంగా పాలకవర్గం, అధికారులు కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా ఎన్‌పీఏ రూ.220 కోట్ల నుంచి రూ.120 కోట్లకు చేరిందని వివరించారు. అర్హత కలిగిన సహకార సంఘాల ద్వారా సభ్యులకు కర్షకమిత్ర రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. డీసీసీబీకి పూర్వవైభవం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం సహకార సంఘాల సభ్యులకు చైర్మన్ జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ మార గంగారెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, సీఈవో నాగభూషణం వందే తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

క్లుప్తంగా

పోలీస్‌ క్యూఆర్‌ కోడ్‌ పోస్టర్‌ ఆవిష్కరణ



ఖలీల్‌వాడి: రైల్వే ఎస్పీ ఆదేశాల మేరకు నిజామాబాదు రైల్వే పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం తెలంగాణ పోలీస్‌ సిటిజెన్‌ క్యూఆర్‌ కోడ్‌ పోస్టర్‌ను రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఆవిష్కరించారు. క్యూఆర్‌ కోడ్‌ ద్వారా ప్రజలు కేసు విషయంపై, పోలీసుల పనితనం, తప్పిదాలను ఫీడ్‌ బ్యాక్‌ ఇవ్వవచ్చన్నారు. ప్రజలందరూ క్యూఆర్‌ కోడ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సెలవుపై వెళ్లిన రెంజల్‌ ఎస్సై

- బదిలీ కోసం ప్రయత్నాలు?

రెంజల్‌(బోధన్‌): రెంజల్‌ ఎస్సై సాయన్న నాలుగు రోజుల పాటు సెలవుపై వెళ్లారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజులు సెలవు తీసుకున్న ఆయన మళ్లీ నాలుగు రోజుల పాటు సెలవుపై వెళ్లడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఆయనపై పలువురు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారుల ఒత్తిడి మేరకు సెలవుపై వెళ్లినట్లు వినిపిస్తుంది. నిర్మల్‌ జిల్లాకు ఎస్సై బదిలీ చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ఇందూరు తిరుమలలో ఎస్‌సీఆర్‌ సీఈ పూజలు



మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మండలంలోని నర్సింగ్‌పల్లిలోగల ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో సౌత్‌ సెంట్రల్‌ రైల్వే చీఫ్‌ ఇంజనీర్‌ ఆంజనేయరెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రైల్వేస్టేషన్ల తనిఖీల్లో భాగంగా జిల్లాకు విచ్చేసిన ఆయన ఇందూరు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రోహిత్‌ కుమారాచార్య ఆయనకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అనంతరం ఆంజనేయ రెడ్డి ఆలయ కేంద్రంలో చేస్తున్న ఆధ్యాత్మిక ప్రకృతి సేద్యాన్ని పరిశీలించారు. ఆలయ ధర్మకర్త నర్సింహారెడ్డిని అభినందించారు. ఏఈ శ్రీహరి, ఆలయ సేవకులు నరాల సుధాకర్‌, ప్రవీణ్‌, పృథ్వీ, సాయిలు ఉన్నారు.

మంజూరు సరే.. పంపిణీ చేసేదెప్పుడు?

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కుల అందజేతలో అధికారుల నిర్లక్ష్యం
- నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు అందని సాయం



మోర్తాడ్‌: పేదింటి ఆడపడచుల పెళ్లికి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ పథకాలను ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద హిందు, ముస్లిం పేద కుటుంబాలకు రూ.1,0116ను చెక్కుల రూపంలో అందజేస్తుంది. కానీ బాల్కొండ నియోజకవర్గంలో పెళ్లి సాయానికి సంబంధించిన చెక్కులు తహసీల్దార్‌ కార్యాలయాలకు చేరి నెలలు గడుస్తున్నా పంపిణీకి నోచుకోవడం లేదు. సకాలంలో సాయం అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెక్కుల గడువు సమీపిస్తున్నా..

బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు నవంబర్‌, డిసెంబర్‌ నెలలోనే కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులు చేరాయి. చెక్కుల కాలపరిమితి 90 రోజుల్లో ముగిసిపోతాయి. గడువు సమీపించినా చెక్కులు లబ్ధిదారుల చేతికి అందకపోవడంతో అవి చెల్లకుండా పోయి సాయం సొమ్ము జమకావడానికి అడ్డంకులు ఏర్పడుతాయనే అభిప్రాయం వ్యక్తమైతుంది. ఒక భీమ్‌గల్‌ మండలానికి సంబంధించిన చెక్కులు మినహా మిగిలిన మండలాల చెక్కులకు కాలపరిమితి ఈనెల చివరితోను, కొన్ని ఫిబ్రవరి మొదటివారంతో ముగిసిపోనుంది.

ప్రొటోకాల్‌ రగడనే కారణమా?

బాల్కొండ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్‌, ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌ల మధ్య ప్రొటోకాల్‌ రగడ నెలకొంది. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన నుంచి ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి తనకు అధికారిక కార్యక్రమాలలో ప్రొటోకాల్‌ను పాటించడం లేదని ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కుల పంపిణీకి ఎమ్మెల్యే హాజరు కావాల్సి ఉన్నా అధికారులు సమాచారం ఇవ్వడం లేదని గతంలో వెల్లడించారు. నవంబర్‌, డిసెంబర్‌ నెలల్లో నియోజకవర్గానికి మంజూరైన చెక్కుల విషయం అధికారులు ఎమ్మెల్యేకు వివరించారో లేదో తెలియదు. కానీ ఇప్పటి వరకు పంపిణీ కార్యక్రమం నిర్వహించకపోవడం గమనార్హం.

కార్యక్రమాన్ని బహిష్కరించిన ఎమ్మెల్యే..

తాము అధికారంలోకి రాగానే ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం కూడా పంపిణీ చేస్తామని కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. కానీ హామీని అధికార పార్టీ విస్మరించిందని అందువల్ల తాను చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ప్రొటోకాల్‌ పాటించాలని చెప్పి చెక్కుల కాలపరిమితి ముగిసిపోయే సమయంలో తన మనసులోని మాటను చెప్పకుండా కాలయాపన చేయడం ఎంత వరకు సమంజసం అని అధికార పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఉన్న వైరం పెళ్లి సాయం అందుకునే వారికి గండంగా మారిందని చెప్పవచ్చు.

మండలాల వారీగా మంజూరైన చెక్కులు

మండలం	చెక్కులు	మంజూరైన తేదీ
భీమ్‌గల్‌	45	09-12-2024
మోర్తాడ్‌	47	02-11-2024
వేల్పూర్‌	51	02-11-2024
ఏర్గట్ల	16	05-11-2024
కమ్మర్‌పల్లి	65	05-11-2024

నెలల తరబడి ఎదురు చూస్తున్నాం..

పెళ్లి సాయం చెక్కు కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్నాం. చెక్కులు మంజూరైన పంపిణీలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కావడం లేదు. పేద, మధ్య తరగతి ప్రజల పట్ల ఇంత అలసత్వం చేయడం సరికాదు.

– మద్ది గోదావరి, రామన్నపేట్‌ (వేల్పూర్‌)

సకాలంలో పంపిణీ చేస్తాం..

బాల్కొండ నియోజకవర్గంలోని 8మండలాలకు గాను 5మండలాల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కులు మంజూరయ్యాయి. అధికారులు ఇతర విధుల్లో ఉండటంతో చెక్కులను పంపిణీ చేయడంలో జాప్యం ఏర్పడి ఉండవచ్చు.లబ్ధిదారులకు సకాలంలో పెళ్లి సాయం చెక్కులు పంపిణీ అయ్యేలా చూస్తాం.

– రాజుగౌడ్‌, ఆర్‌డీవో, ఆర్మూర్‌

మహిళా సంక్షేమానికి పెద్ద పీట

- నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ గుప్తా



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌

నిజామాబాద్‌నాగారం: మహిళల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణగుప్తా అన్నారు. మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని, భేటీబచావో భేటీపడావో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్పోర్ట్స్‌ గ్రౌండ్‌ నుంచి న్యూ అంబేడ్కర్‌ భవన్‌ వరకు ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. న్యూ అంబేడ్కర్‌ భవన్‌లో నిర్వహించిన జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని అన్నారు. అనంతరం నగర మేయర్‌ దండు నీతూకిరణ్‌ మాట్లాడుతూ.. మహిళలు ఎదగడానికి కుటుంబ సభ్యుల సహకారం చాలా అవసరమని అన్నారు. మహిళా కమిషన్‌ మెంబర్‌ సుదాం లక్ష్మి మాట్లాడుతూ.. పిల్లలకు ఫోన్‌లు దూరంగా పెట్టాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి ఎస్‌కే రసూల్‌బీ మాట్లాడుతూ.. యూనిసెఫ్‌ నివేదిక ప్రకారం మహిళల వివాహ వయస్సును పెంచాలని అన్నారు. డీఎంహెచ్‌వో రాజశ్రీ మాట్లాడుతూ.. ఆరోగ్య శాఖ వారి ఆధ్వర్యంలో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా చర్యలు తీసుకొంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మోహన్‌ దాస్‌, భాగ్యలక్ష్మి, మాధవి, వెంకటేశ్వర్‌, స్వప్న, సౌమ్య, పుష్ప, కవిత, ఆదిత్య, ఉదయ్‌, చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా అధికారులు, చిన్నారులతో మేయర్‌, మహిళా కమిషన్‌ సభ్యురాలు

ప్రతి విద్యార్థికి అపార్‌ తప్పనిసరి





మాట్లాడుతున్న విద్యాశాఖ జిల్లా సెక్టోరల్‌ ఆఫీసర్‌ శ్రీధర్‌.. పాల్గొన్న విద్యాసంస్థల ప్రతినిధులు

బోధన్‌: ప్రతి విద్యార్థికి అపార్‌ (అటోమేటెడ్‌ పర్మినెంట్‌ అకడమిక్‌ అకౌంట్‌ రిజిస్ట్రీ) ఐడీ తప్పనిసరిగా జనరేట్‌ చేయాలని విద్యాశాఖ నిజామాబాద్‌ సెక్టోరల్‌ ఆఫీసర్‌ శ్రీధర్‌ అన్నారు. పట్టణంలోని డివిజన్‌ డిప్యూటీ ఎడ్యుకేషన్‌ ఆఫీసర్‌ కార్యాలయంలో శుక్రవారం ఆయన అపార్‌ నమోదు ప్రక్రియపై పట్టణ, మండల స్థాయి ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలలు, కళాశాలల హెచ్‌ఎం, ప్రిన్సిపాల్స్‌, ప్రతినిధులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థుల రికార్డు, యుడైస్‌ ప్లస్‌, ఆధార్‌కార్డు వివరాలు 40శాతం మంది విద్యార్థుల వివరాలు సరిగ్గానే ఉన్నాయని, వారి అపార్‌ ఐడీని జనరేట్‌ చేయాలని తెలిపారు. మిగిలిన విద్యార్థుల వివరాలను రాష్ట్ర సంచాలకుల నుంచి వచ్చిన ప్రొసీడింగ్‌ ఆధారంగా మండల స్థాయిలో విద్యార్థులకు సంబంధించిన వివరాలను సరిచేయాలని వివరించారు. ఏపీవో (అసిస్టెంట్‌ ప్రోగామింగ్‌ ఆఫీసర్‌) అశ్రఫ్‌ మాట్లాడుతూ.. అపార్‌లో విద్యార్థులకు సంబంధించి తల్లిదండ్రులు, పుట్టిన తేదీ, ఆధార్‌ వివరాలు నమోదు చేయబడుతున్నందున, సందేహాలను నివృత్తి చేసుకుని ఖచ్చితమైన వివరాలతో అపార్‌ ఐడీని క్రియేట్‌ చేయాలన్నారు. ఎంఈవో నాగయ్య, సీఆర్‌పీలు విజయ్‌, బాబు, యూసుఫ్‌, శివానంద్‌, విజయరేఖ, దేవానంద్‌, స్కూల్‌కాంప్లెక్స్‌ హెచ్‌ఎం రత్నాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

వారసుల కోసం ఆడపిల్లలను చంపొద్దు

- సేవ్‌ గర్ల్‌–సేవ్‌ ఉమెన్‌–సేవ్‌ ఇండియా ఫ్లెక్సీతో యువకుడి ప్రచారం



నిజామాబాద్‌నాగారం: ఇంటి వారసుడి కోసం ఆడపిల్లలను చంపవద్దని, ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మి అని నగరానికి చెందిన యువకుడు శ్రీనివాస్‌ కోరుతున్నాడు. సేవ్‌ గర్ల్‌..సేవ్‌ ఉమెన్‌.. సేవ్‌ ఇండియా అనే నినాదంతో నగరంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి, నిరసన చేపట్టారు. అమ్మనాన్న మీ ఆస్తులు వద్దు.. నన్ను బతకనివ్వండి చాలు.. అమ్మ నేను 5 నెలల ముద్దను నన్ను చంపకండి.. నాకు బతకాలని ఉంది.. అనే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. 2018 సంవత్సరం నుంచి ప్రతియేటా నగరంలో ఇలా ఫ్లెక్సీలను ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపాడు. నోరులేని మూగ జీవుల కోసం ప్రత్యేకశాఖ ఉందని, అలాగే ఆడపిల్లల కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను కోరుతున్నాడు. 2016లో కంఠేశ్వర్‌లో ఆడపిల్ల పుట్టిందని తెలిసి చంపివేసిన ఘటన తనను కలిచివేసిందని, దీంతో ఇలాంటి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని పేర్కొన్నారు.

కారు బోల్తా.. ఒకరి మృతి!

- మరొకరికి తీవ్ర గాయాలు

వేల్పూర్‌: మండలంలోని అమీనాపూర్‌ సమీపంలో గల మూలమలుపు వద్ద శుక్రవారం రాత్రి కారు అదుపుతప్పి బోల్తాపడగా ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా.. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి(40), వేల్పూర్‌కు చెందిన మరోవ్యక్తి కారులో వేల్పూర్‌ వైపు వెళ్తుండగా మూల మలుపు వద్ద కారు అదుపుతప్పి బోల్తా కొట్టినట్లు సమాచారం. ఘటనలో శ్రీనివాస్‌రెడ్డి మృతిచెందగా, మరొకరు గాయపడ్డారని సమాచారం. స్థానికులు వారిని గమనించి 108అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వారిని 108 సిబ్బంది ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకోనట్లు సమాచారం.

క్రైం కార్నర్‌

ప్రియుడితో కలిసి భర్త హత్య



మైశయ్య (ఫైల్‌)

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): ప్రియుడి మోజులో పడి భర్తను హత్య చేసిన ఘటన నస్రుల్లాబాద్‌ మండలం నెమ్లి గ్రామంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన టేకుర్ల మైశయ్య(42) గత కొంతకాలంగా కనబడుట లేదని తల్లి లచ్చవ్వ ఈనెల 21న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మైశయ్య భార్య రాధ నాగరాజు అనే వ్యక్తితో కలిసి ఉండటంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. తమ వివాహేతర సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడన్న ఉద్దేశంతో ఇద్దరు కలిసి అతడిని గొంతు నులిమి చంపేసి, మృతదేహాన్ని దుర్కి శివారులో గల సోమలింగేశ్వర ఆలయం వెనుక పారేసినట్లు తెలిపారు. పోలీసులు శుక్రవారం ఘటన స్థలాన్ని పరిశీలించి గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి పూడ్చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై లావణ్య తెలిపారు.

రూ. వెయ్యి కోసం రెండు హత్యలు

- ఒక హత్యను కప్పిపుచ్చేందుకు మరొకటి..
- వారంలో కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజావెంకటరెడ్డి

నిజామాబాద్‌ రూరల్‌: వెయ్యి రూపాయల కోసం రెండు హత్యలు జరిగాయి. నిజామాబాద్‌లో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. నిజామాబాద్‌ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌ నగరానికి చెందిన ఎండీ అమర్‌ ఖాన్‌, రియాజ్‌ఖాన్‌, మహ్మద్‌ బహదూర్‌, సయ్యద్‌ యూసుఫ్‌ ఖాన్‌ స్నేహితులు. మృతదేహాలను కాల్చిన తర్వాత వచ్చే బూడిదను తీసుకుని, అందులో బంగారం, వెండి కోసం గాలిస్తుంటారు. ఈనెల 18న అమర్‌ ఖాన్‌, రియాజ్‌ఖాన్‌, మహ్మద్‌ బహదూర్‌ కలిసి బైక్‌పై ఆర్మూర్‌ రోడ్డులోని విజయ రూరల్‌ ఇంజినీరింగ్‌ కాలేజీ సమీపంలోగల నిజాంసాగర్‌ కెనాల్‌ కట్ట వద్దకు వెళ్లారు. అక్కడ శ్మశాన వాటికలోని బూడిదను తీసుకుని నీటిలో గాలించినా ఏమీ దొరకలేదు. అక్కడినుంచి గూపన్‌పల్లి శ్మశాన వాటికకు వెళ్లి బూడిదను గాలించినా ప్రయోజనం లేకపోయింది. అనంతరం అమర్‌ఖాన్‌ వద్దనున్న వెయ్యి రూపాయలతో మద్యం కొనుక్కుని తాగారు. ఈ క్రమంలో అమర్‌ ఖాన్‌కు బహదూర్‌కు మధ్య గొడవ జరిగింది. బహదూర్‌ను చంపుదామని అమర్‌ ఖాన్‌, రియాజ్‌ ఖాన్‌లు నిర్ణయించుకుని కర్రతో ఇష్టం వచ్చినట్లు కొట్టి చంపి, నీటిలో పడేసి వెళ్లిపోయారు. మరుసటి రోజు మరో స్నేహితుడైన యూసుఫ్‌ఖాన్‌(దివ్యాంగుడు) బహదూర్‌ గురించి మిగతా ఇద్దరిని ఆరా తీశాడు. దీంతో హత్య విషయం బయటకు వస్తుందనే భయంతో యూసుఫ్‌ను సైతం నమ్మించి నగరంలోని బాబన్‌సాబ్‌ పహాడ్‌లోని జాలి తలాబ్‌కు తీసుకెళ్లారు. స్నానం చేస్తున్నట్లు నటించి అతడిని నీటిలో ముంచి చంపేశారు. కేసులు నమోదు చేసుకున్న పోలీసులు.. ఫోన్‌ లొకేషన్‌ల ఆధారంగా నిందితులను గుర్తించి, అరెస్ట్‌ చేశారు. సమావేశంలో నిజామాబాద్‌ సౌత్‌ సీఐ సురేష్‌, రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ఆరిఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

దొంగ నోట్ల కేసులో నిందితుల అరెస్టు

- నకిలీ కరెన్సీ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని చద్మల్‌ తండాలో నకిలీ కరెన్సీ నోట్లు చెలామణి, సరఫరా చేసిన నిందితులను శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌ చేసినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సదాశివనగర్‌ సీఐ సంతోష్‌, గాంధారి ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు.. చద్మల్‌తండాలోని లక్ష్మమ్మ ఆలయంలో ప్రతిఏటా సంక్రాంతికి ఉత్సవాలు జరుపుతారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని నగదు కానుకలు సమర్పించగా, వాటిని వీడీసీ వారు వడ్డీకి ఇస్తుంటారు. ఈక్రమంలో ఉత్సవాలు ముగిసిన తరువాత వీడీసీ వారు కొందరికి అప్పు ఇచ్చారు. కొన్ని నోట్ల కట్టల్లో రూ.500 నోట్లు నకిలీవి రావడంతో తీసుకున్నవారు గమనించి సదరు వ్యక్తులు, గ్రామ పెద్దల దృష్టికి తెచ్చారు. వారు తమకేమీ తెలియదనడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టగా చద్మల్‌ తండాకు చెందిన విలేజ్‌ కమిటీ క్యాషియర్‌ మాండు గోపాల్‌, అదే తండాకు చెందిన మాలీ రవీందర్‌ కలిసి నకిలీ కరెన్సీ నోట్లను అసలు నోట్లల్లో ఉంచినట్లు తేలింది. ఈ నోట్లను డప్పు తండాకు చెందిన బడావత్‌ సంగ్రామ్‌ ఇచ్చినట్లు తేలింది. కొన్ని నెలల క్రితం సంగ్రామ్‌కు నిజామాబాద్‌కు చెందిన తిరుపతి ఆలియాస్‌ రాజు పరిచయమవగా తన వద్ద ఉన్న నకిలీనోట్ల విషయం చెప్పాడు. వాటిని చెలామణి చేస్తే డబ్బులు బాగా సంపాదించవచ్చని ఆశ చూపాడు. దీంతో ఈ విషయాన్ని సంగ్రామ్‌ పోచారం తండాకు చెందిన మూడు రవీందర్‌, సోమ్లానాయక్‌ తండాకు చెందిన దరావత్‌ చందర్‌కు తెలిపాడు. ఈ ముగ్గురు కలిసి నిజామాబాద్‌కు వెళ్లగా అక్కడ మరో ముగ్గురు (తిరుపతి ఆలియాస్‌ రాజు, మగ్గిడి కిషన్‌ ఆలియాస్‌ వెంకట్‌, రామ్‌టెంకి భానుప్రసాద్‌) వారిని కలిసి, ఒక అసలు నోటు ఇస్తే నాలుగు నకిలీ నోట్లు ఇస్తామని చెప్పారు. దీంతో సంగ్రామ్‌, రవీందర్‌, చందర్‌ వారి వద్ద ఉన్న రూ. 1.20 లక్షలు అసలు నోట్లు ఇచ్చి, నకిలీ నోట్లు తీసుకున్నారు. సంగ్రామ్‌ తీసుకున్న నకిలీ నోట్లను చెలామణి చేసేందుకు చద్మల్‌ తండాకు చెందిన మాండు గోపాల్‌, మాలీ రవీందర్‌ను కలుపుకుని పథకం వేశారు. వడ్డీకి ఇచ్చే కట్టల్లో నకిలీ నోట్లు ఉంచి పట్టుపడ్డారు. వారి వద్ద నుంచి 291 నకిలీ రూ. 500 నోట్లు, 157 రూ. 200 నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు మాండు గోపాల్‌, మాలీ రవీందర్‌, బడావత్‌ సంగ్రామ్‌, మూడు రవీందర్‌, దరావత్‌ చందర్‌, మగ్గిడి కిషన్‌, రామ్‌ టెంకి భానుప్రసాద్‌ను రిమాండ్‌ చేసినట్లు తెలిపారు. సదాశివనగర్‌ సీఐ సంతోష్‌, గాంధారి ఎస్సై ఆంజనేయులు, హెడ్‌ కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌, ఐడీ పార్టీ కానిస్టేబుల్‌ రవికుమార్‌, గాంధారి హెడ్‌ కానిస్టేబుల్‌ రమణారెడ్డి, సిబ్బంది బంతిలాల్‌, సుభాష్‌ తదితరులను ఎస్పీ సింధుశర్మ అభినందించినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు నదిలో పడి బాలుడు మృతి



నిజాంసాగర్‌(జుక్కల్‌): మండలంలోని ఒడ్డేపల్లి గ్రామానికి చెందిన గోష్కె సందీప్‌(13) అనే బాలుడు శుక్రవారం మంజీరా నదిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఎస్సై శివకుమార్‌ తెలిపారు. గ్రామానికి చెందిన గోష్కె సాయిలు–బాలవ్వ దంపతుల కుమారుడు సందీప్‌ పొలానికి వెళ్లగా, సమీపంలో ఉన్న నదిలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి, మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

మోపాల్‌: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరి గౌడ్‌ శుక్రవారం తెలిపారు. డిచ్‌పల్లికి చెందిన జమీల్‌ (41) కంజర్‌ శివారులోని ఫిల్టర్‌బెడ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. మోపాల్‌లో అతడు గురువారం నడుచుకుంటూ వెళ్తుండగా, కంజర్‌ గ్రామానికి చెందిన గంగాధర్‌ బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈఘటనలో జమీల్‌కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



నాగరాజు (ఫైల్‌)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్‌ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. లింగంపేటకు చెందిన దేమె నాగరాజు(31) నిజాంసాగర్‌ సోషల్‌ వెల్ఫేర్‌ స్కూల్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. అతడు మద్యానికి బానిస కాగా, గురువారం సాయంత్రం తల్లి బాలమ్మను మద్యం కోసం డబ్బులు కావాలని గొడవ పడ్డాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో తల్లిని కొట్టి ఇంట్లో నుంచి బయటకు వెళ్లగొట్టాడు. ఆమె ఉదయం ఇంటికి వచ్చి తలుపులు తీయమని కొడుకును ఎంతసేపటికీ పిలిచినా తలుపులు తీయలేదు. చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులు తెరిచి చూడగా అతడు ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని వేలాడుతున్నాడు. మృతుడి భార్య స్వప్న, కూతురు సహస్ర సంక్రాంతి సందర్భంగా తల్లిగారింటికి వెళ్లారు. బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపం చెంది ఒకరు..



సురేష్‌ (ఫైల్‌)

సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు వడ్డెర కాలనీకి చెందిన పిట్ల సురేష్‌ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎల్‌ రామ్‌ శుక్రవారం తెలిపారు. ఆటో డ్రైవర్‌గా పని చేసే సురేష్‌ మద్యానికి బానిసై ప్రతిరోజు భార్యతో గొడవపడేవాడు. మద్యం తాగకుండా ఏదైనా పని చేసుకోమని భార్య అనడంతో మనస్తాపం చెంది, సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి రామవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది..



కాశీరాం(ఫైల్‌)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని చామంతుల కాశీరాం(50) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. కాశీరాం గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించుకున్నా వ్యాధి నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో దూలానికి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు, భార్య ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో 8మందికి గాయాలు

వర్ని: మండలంలోని బడా పహాడ్‌లో శుక్రవారం దర్గా దర్శనానికి వచ్చిన భక్తులపై కుక్కలు దాడి చేయగా 8మందికి తీవ్ర గాయాలయినట్లు స్థానికులు తెలిపారు. దాడిలో గాయపడిన వారిని వైద్య చికిత్స కోసం వెంటనే 108అంబులెన్స్‌లో స్థానిక ఆస్పత్రికి తరలించారు.

కూతురుపై తండ్రి లైంగిక దాడి

బాన్సువాడ: బాన్సువాడ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఓ బాలికపై ఆమె తండ్రి లైంగిక దాడి చేయగా, నిందితుడిపై పోక్సో చట్టం కేసు నమోదైనట్లు తెలిసింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక వసతిగృహంలో ఉంటూ విద్యను అభ్యసిస్తుంది. ఇటీవల ఇంటికి వచ్చిన బాలికపై తండ్రి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి, కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

బోధన్‌ మండలంలో..

బోధన్‌రూరల్‌: మండలంలోని ఓ గ్రామంలో బాలికపై ఓ బాలుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల బాలికపై బాలుడు లైంగికదాడికి పాల్పడిన విషయం గ్రామస్తులకు తెలియడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు ఇప్పటికే పోక్సో చట్టం కింద నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

ఎల్లారెడ్డి: మండలంలోని కళ్యాణి గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై మహేష్‌ శుక్రవారం తెలిపారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడిచేసినట్లు పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రెండు బైకులు, రెండు సెల్‌ఫోన్లు, రూ.7080 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

హుండీల చోరీ



సీసీ కెమెరాలో రికార్డు అయిన నిందితుడి చిత్రం

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలోని పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లోగల హుండీలను గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం వేకువజామున ధ్వంసం చేసి, డబ్బులను చోరీ చేశారు. సదరు ఘటనలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఆలయక మిటీల ఫిర్యాదు మేరకు భిక్కనూరుపోలీసులు ఘటనాస్థలాన్ని సందర్శించి కేసునమోదు చేశారు.

డ్రంకన్‌డ్రైవ్‌ కేసులో పలువురికి జైలు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌లో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీల్లో ఆర్మూర్‌కు చెందిన మారాత నగేష్‌, మాసం మహేష్‌, బాలాజీ పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరు పర్చగా ఆర్మూర్‌ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ముగ్గురికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ శుక్రవారం తెలిపారు.

ఖలీల్‌వాడి: నగరంలో ఇటీవల నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీల్లో 11మంది పట్టుబడగా వారికి ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ ఆదేశాల మేరకు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ శుక్రవారం ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌లో కౌన్సెలింగ్‌ నిర్వహించారు. అనంతరం సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరు పరచగా ఐదుగురికి జైలుశిక్ష విధించగా, మిగిలిన ఆరుగురికి రూ.9500 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

బోధన్‌టౌన్‌(బోధన్‌):పట్టణ పరిధిలో మద్యం తాగి వాహనం నడుపుతున్న ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకోగా శుక్రవారం అతడిని బోధన్‌ కోర్టు సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆ వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తు తీర్పునిచ్చినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

రుద్రూర్‌: కోటగిరి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఈ నెల 8న వాహనాల తనిఖీ చేస్తుండగా మద్యం తాగి బైక్‌ నడుపుతున్న సుధాకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని బోధన్‌ కోర్టులో హాజరు పర్చగా జడ్జి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు కోటగిరి ఎస్సై సందీప్‌ తెలిపారు.